క్లుప్తంగా

మొగల్తూరులో ఫ్యామిలీ ఫిజీషియన్



రోగికి సంబంధించిన రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ దినేష్

మొగల్తూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దినేష్ కోరారు. మొగల్తూరు 3వ సచివాలయ పరిధిలోని కొత్తకాయలతిప్ప గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని బాలింతలను, గర్భిణులను లేవలేని పరిస్థితుల్లో ఉన్న రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా సచివాలయానికి వచ్చిన వారితో పాటు గ్రామంలోని రోగులను సుమారు 176 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేయగా వీరిలో 26 మందికి షుగర్, 32 మందికి బీపీ ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది దేవిశ్రీ, సావిత్రి కె.సాంబశివరావు, "సునీత, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆక్వా రైతులకు అవగాహన సదస్సు

మొగల్తూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఆక్వా రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు మత్స్యశాఖాధికారి వివేక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆక్వా డీలర్లు, ఆక్వా రైతులు పాల్గొనే ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎంపెడా అధికారులు పాల్గొంటారని, రైతులు, డీలర్లు హాజరుకావాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ



ఆసుపత్రి రిసెప్షన్ వద్ద పరిస్థితి పరిశీలిస్తున్న ఆర్డీఓ

నరసాపురం: నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ బుధవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్యసదుపాయల విషయంలో ఏమైనా లోపాలున్నాయా? అనే విషయంపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జ్వరాలతో వచ్చే రోగుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యులను ఆదేశించారు. వ్యాధుల విషయంలో పరసరాల పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించాలని చెప్పారు. రోగుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని చెప్పారు. ఆయన వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుప్రియ ఉన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

నరసాపురం రూరల్: బాలికను పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు మొగల్తూరు ఎస్సై రాజేంద్ర తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం మొగల్తూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 17 సంవత్సరాల బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేయడంతో కేసు నమోదు చేశారు. బాలిక ఇటీవల అస్వస్థతకు గురి కావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా ఎనిమిదో నెల గర్భిణిగా వైద్యులు ధృవీకరించారు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెనుగొండలో ఇంటింటి సర్వే



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెనుగొండ: మార్టేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం పెనుగొండలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ జ్వరాల కేసులను నమోదు చేసుకున్నారు. జ్వరం వస్తే సత్వరం ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలంటూ హెల్త్ సూపర్‌వైజర్ అడ్డాల ఉమామహేశ్వరరావు సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పురోహితుల జీతాల పెంపుపై హర్షం

పాలకొల్లు సెంట్రల్: ఆలయాల్లో పనిచేస్తున్న పురోహితులకు జీతాలు పెంచడం హర్షణీయమని పట్టణ గాయత్రీ పురోహిత సంఘం అధ్యక్షులు తనికెళ్ల శ్రీనివాసు అన్నారు. బుధవారం స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గాయత్రి పురోహిత సంఘం సమావేశంలో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. మద్దూరి సూరిబాబు, పెండ్యాల రామారావు, గరిమెళ్ల రాంబాబు, భమిడిపాటి పవన్ పాల్గొన్నారు.



భయం..భయంగా విధులు నిర్వర్తిస్తున్నాం



కోల్‌కతాలో జరిగిన ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార సంఘటన చాలా బాధాకరం. రాత్రి సమయాల్లో అత్యవసరమైతే భయం..భయంగా విధులు నిర్వర్తిస్తున్నాం. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలంటే ప్రభుత్వం చట్టాలను మరింత కఠినతరం చేయాలి. ప్రజల ప్రాణాలకు రక్షణగా ఉండే వైద్య సిబ్బందికి మరింత రక్షణ కల్పించాలి. కోల్‌కతా లాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– కె ప్రశాంతి, జనరల్ సర్జన్, నరసాపురం ఏరియా ఆసుపత్రి

సెక్యూరిటీ కల్పించాలి



కోల్‌కతాలో మహిళా వైద్యురాలు హత్య విషయం తెలిసిన తర్వాత విధులు నిర్వహించాలంటే భయపడుతున్నాం. ముఖ్యంగా అర్ధరాత్రి సమయంలో గర్భిణులకు సీరియస్ అయితే వారి వెంట వచ్చి ఆస్పత్రులో చేర్పించి తిరిగి ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది. ఆ సమయంలో ఒంటరిగా ప్రయాణిస్తున్నాం. అత్యవసర సమయాల్లో స్థానిక పోలీసుల ద్వారా మాకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పి.నాగమణి, ఏఎన్ఎం, కొంతేరు

పారిశుద్ధ్య మెరుగుదలకు చర్యలు

కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్





సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు

నరసాపురం: పట్టణంలో అన్ని వార్డుల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అన్నారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు పారిశుద్ధ్య సమస్యలపై అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానం చెప్పారు. వర్షాకాలం దృష్ట్యా వార్డుల్లో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామన్నారు. వార్డుల్లో అవసరమైన చోట్ల డ్రెయినేజీలు మరమ్మతులు జరుగుతున్నాయని చెప్పారు. వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని మాట్లాడుతూ ఇటీవల మున్సిపాలిటీకి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా గవర్నర్ విందులో పాల్గొనడం ఆనందదాయకమని చెప్పారు. వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, కౌన్సిలర్లు సఖినేటిపల్లి, కోటిపల్లి సురేష్, పాలూరి బాబ్జి, జిల్లెళ్ల దిలీప్, బొంతు రాజశేఖర్ పలు సమస్యలు ప్రస్తావించారు.

కమిటీల ఏర్పాటుకు ఆమోదం

మున్సిపాలిటీలో కౌన్సిలర్లుతో కూడిన 5 కమిటీల ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కాంట్రాక్ట్ కమిటి సభ్యులుగా ద్వారా గంగా భవానీ, వంగా శ్రీకాంత్ కన్నా, తాడి సునీత, ఉర్రా ఉమ, జిల్లెళ్ల దిలీప్, అడిదల శ్యామల, పాలూరి బాబ్జి. శానిటేషన్ కమిటి సభ్యులుగా కొప్పాడ కృష్ణవేణి, చిట్టూరి పద్మ, కోటిపల్లి సురేష్, వాటర్‌వర్క్స్ కమిటి సభ్యులుగా వన్నెంరెడ్డి శ్రీను, బొమ్మిడి సూర్యకుమారి, కస్తూరి ఇందిరాదేవి, ఉద్యోగుల నియాబకపు కమిటి సభ్యులుగా మల్లాడి శేషవేణి, పతివాడ పద్మ, తోట అరుణ, కేసరి గంగరాజు, కావలి రామసీత, గోరు రమాదేవి, సిర్రా కాంతమ్మ, లైటింగ్ కమిటి సభ్యులుగా సఖినేటిపల్లి సురేష్, భారతి సురేష్, సోమరాజు దుర్గాభవానీల నియామకానికి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల అందజేత



దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న దృశ్యం

పెనుమంట్ర: పెనుమంట్ర మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, నరసాపురం ఆర్టీసీ డిపో సౌజన్యంతో దివ్యాంగులకు బుధవారం ఉచిత బస్సు పాసులు పంపిణీ చేశారు. మార్టేరులోని మానవత భవనంలో డిపో మేనేజర్ సత్తి సుబ్బన్నరెడ్డి, మానవత అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి బస్సుపాసుల శిబిరాన్ని ప్రారంభించారు. అభాగ్యులను ఆదుకోవడంలో మానవత సంస్థ ముందు ఉంటుందని మానవత సంస్థ అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి అన్నారు. మార్టేరు పరిసర ప్రాంతాల నుండి 70 మంది దివ్యాంగులకు బస్సులు పాస్‌లు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసుల మురళీకృష్ణ, కోశాధికారి చదువుల నరేంద్ర, రీజనల్ ఛైర్మన్ బాణాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మొగల్తూరులోని గొడావారిపాలెంలో పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీహెచ్ఏ మూర్తి

మొగల్తూరు: జ్వరాలు రాకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీహెచ్ఏ మూర్తి సూచించారు. మొగల్తూరు గ్రామంలోని గోడావారిపూటలో ఇంటి పరిసరాలను బుధవారం ఆయన పరిశీలించి చెత్త, చెదారాలను ఎత్తివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే జ్వరాలను అరికట్టవచ్చన్నారు. ఇంటి పరిసరాల్లో పడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, కుండలు, పగిలిన సిమెంట్ కుండీలు, ఖాళీ డబ్బాలు వంటి వాటిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమకాటుకు గురికాకుండా కిటికీలకు, తలుపులకు మెస్‌లు అమర్చుకోవాలన్నారు. జ్వరం లక్షణాలు కనబడితే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలోని డాక్టర్‌ను సంప్రదించాలని, ఆసుపత్రిలోని డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటే దగ్గరలోని ఆసుపత్రికి రిఫర్ చేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ విజయలక్ష్మి, ఏఎన్ఎం స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ఠ



శ్రీ సీతారామ లక్ష్మణ శ్వేత శిలామయ విగ్రహాలు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు రూరల్ పంచాయతీ చిత్రాయిచెరువుగట్టున నూతనంగా నిర్మించిన శ్రీ సాయి గాయత్రి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. శతాధిక ప్రతిష్ఠాపనాచార్య పెద్దింటి అనిల్‌కుమారాచార్యుల బ్రహ్మత్వంలో ఆలయ నిర్మాణ ప్రోత్సాహకులు గోపి సత్యనారాయణ దంపతులతో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఆలయంలో శ్రీ గాయత్రి, విశ్వకర్మ, పరమేశ్వర, గణపతి, కోదండరామ, రాధాకృష్ణ, షిరిడి సాయి, సత్యసాయిబాబా వారి శ్వేత శిలామయ విగ్రహ ప్రతిష్ఠను నూతన ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక యాగాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు.

పాత ఇనుప సామగ్రి షాపులో చోరీ

యలమంచిలి: శిరగాలపల్లి గ్రామంలో ఉన్న పాత ఇనుము సామగ్రి షాపులోచోరీ జరిగిందని వ్యాపారి వల్లభు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు చేశారని ఎస్సై కర్ణీడి గుర్రయ్య బుధవారం విలేకరులకు తెలిపారు. 25 కిలోల పాత ఇత్తడి, 20 కిలోల పాత రాగి, టూల్ బాక్సు కిట్ చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు



రామన్నపాలెంలోని అడవిపర్రలో రైతులతో మాట్లాడుతున శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

మొగల్తూరు/నరసాపురం రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు చేలు ముంపునకు గురైన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శాస్త్రవేత్తలు తెలిపారు. మొగల్తూరు మండలం రామన్నపాలెంలోని అడవిపర్ర, సుబ్రహ్మణ్యస్వామి గుడి ప్రాంతాలలో, నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం, సరిపల్లి, రుస్తుంబాధ, చిట్టవరం తదితర గ్రామాల్లో ముంపునకు గురైన పొలాలను ఉండి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. అనంతరం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు, యాజమాన్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ పి.వినయలక్ష్మిలు రైతులతో మాట్లాడారు. చేలల్లోని నీరు బయటకు తోడిన తరువాత ఎకరాకు 20 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్‌ను వెదజల్లాలన్నారు.అంతే కాక 1 గ్రాము కార్బన్‌డిజమ్, మాంకోజెబ్ కలిపిన మిశ్రమాన్ని పిచికారీ చేయాలన్నారు. అక్కడక్కడ జింక్ లోపం కనిపిస్తుందని జింక్ లోపం నివారణకు 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ అనిల్ కుమారి, ఏఓ అబ్దుల్ రహీమ్, రైతు సేవా కేంద్రం ఇన్ చార్జ్ ఎ రాజ్‌గోపాల్, రైతులు యాతం పాండురంగారావు, దాసరి గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కందరవల్లిలో తాటాకిల్లు దగ్ధం



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన తాటాకిల్లు

పెనుగొండ: విద్యుత్ తీగల నుంచి వెలువడిన మంటలతో ఆచంట మండలం కందరవల్లిలో తాటాకిల్లు అగ్నికి ఆహుతైంది. బుధవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. కొబ్బరి వలుపు కార్మికుడు కటారి ఏడుకొండలు, ముగ్గురు సంతానంతో తాటికింట్లో నివాసం ఉంటున్నాడు. జీవనోపాధి కష్టంగా ఉండడం, ముగ్గురు పిల్లలతో చాలీచాలని కూలీతో ముందుకు సాగడం ఇబ్బందికరంగా ఉండడంతో భార్య వెంకట లక్ష్మీ ఇటీవలే గల్ఫ్ దేశానికి వెళ్లింది. దీంతో ఇద్దరు కుమారులు, కుమార్తెతో నివాసం ఉంటున్నాడు. పిల్లలు పాఠశాలకు వెళ్లడంతో, ఏడుకొండలు దగ్గరలో దుకాణానికి వెళ్లిన సమయంలో విద్యుత్ తీగల నుంచి మంటలు చెలరేగడంతో చూస్తుండగానే భారీ మంటలతో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. కుటుంబం యావత్తు కేవలం కట్టుబట్టలతో నిలిచారు. ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన కుమార్తె కేవలం యూనిఫాంలోనే ఉండి ఇంటి వద్ద విలపించడం అందరినీ కలిచివేసింది. ఆచంట వైస్ ఎంపీపీ ఎర్రగొప్పుల నాగరాజు చిన్నారిని అక్కున చేర్చుకొని ఓదార్చినా రోదిస్తూనే ఉండడంతో సమీపంలో ఉన్నవారు చలించిపోయారు. దాతలు, అధికారులు ఆదుకోవాలంటూ వైస్ ఎంపీపీ నాగరాజు కోరారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఈద అనిలకుమారి

యలమంచిలి: వ్యవసాయ సాగులో మెరుగైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని నరసాపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకురాలు ఈద అనిలకుమారి చెప్పారు. మండలంలోని గుంపర్రు గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె రైతులకు వ్యవసాయ సాగులో మేలైన పద్ధతులు గురించి వివరించారు. ఈ ఖరీఫ్ పంటలో రైతులు అత్యధిక మంది ఎంటీయూ–1318 సాగు చేశారని, ఈ రకం వరికి యూరియా తగ్గించి వాడితే పంట త్వరగా కోతకు వస్తుందని ఆమె చెప్పారు. కాంప్లెక్స్ ఎరువులు కూడా వరి దుబ్బు చేసే దశలో, అంకురం ఏర్పడే సమయంలో వాడకూడదని ఆమె చెప్పారు. అధిక మోతాదులో అవసరానికి మించి పురుగుమందులు వాడడం వల్ల మిత్ర పురుగులు సంతతి తగ్గిపోతుందని తెలిపారు. పురుగుమందులు పిచికారి చేసే సమయంలో ముక్కుకి మాస్క్, చేతులకు గ్లౌజ్‌లు, శరీరానికి యాప్రాన్ ధరించాలని, తద్వార మనుషులపై పురుగు మందుల విషప్రభావాన్ని తగ్గించవచ్చునని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఆచంట నియోజకవర్గ ఆపుస్మా నూతన కార్యవర్గం

పెనుగొండ: ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థల సమస్యల పరిష్కారానికి అపుస్మా ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని అపుస్మా రాష్ట్ర నాయకుడు జి.బాలాజీ అన్నారు. బుధవారం పెనుగొండలోని త్యాగరాజ గాన సభలో అపుస్మా ఆచంట జోన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా గవర రవికుమార్, గౌరవ అధ్యక్షుడిగా పి.వెంకట రెడ్డి, కార్యదర్శిగా కుక్కల రవికుమార్, కోశాధికారిగా మేడపాటి రమేష్ రెడ్డిలను, జిల్లా కార్యవర్గ సభ్యులుగా జి.కేశవరావు, డి.రమేష్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాపారావు నాయుడు, కార్యదర్శి కె.సుబ్బరాజు, కోశాధికారి కొమ్ముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశువుల సమాచారం తప్పకుండా ఇవ్వాలి



జాతీయ పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు

భీమవరం అర్బన్: సెప్టెంబర్ 1 నుంచి 21వ జాతీయ పశుగణనను ప్రారంభిస్తున్నారని రైతులు, పశు పెంపకం దారులు తమ పశువుల గురించి తప్పకుండా సమాచారం ఇవ్వాలని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 21వ జాతీయ పశుగణన పోస్టర్‌ను ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సంబంధించి కచ్చితమైన లెక్క చెబితే దానిననుసరించే వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. మండల పశువైద్యాధికారి పి. పుండరీబాబు మాట్లాడుతూ పశు గణన ప్రతి ఐదేళ్లకోసారి జరుగుతుందని తొలుత ఈ గణన 1919–1920 లో ప్రారంభించారన్నారు. పశుగణన చేపట్టే ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ఇంటింటికీ తిరిగి గేదెలు, ఆవులు, వాటి జాతులు, పందులు, కుక్కలు, తదితర పశు జాతులను నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కాండ్రేగుల నరసింహరావు, తహసీల్దార్ రావి రాంబాబు, ఎంపీడీఓ కె. వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాలను అరికట్టడంలో విఫలం

భీమవరం: ఇటీవల కాలంలో పరిశ్రమల్లో పెరుగుతున్న ప్రమాదాలను అరికట్టే చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె రాజారామ్మోహన్‌రాయ్ విమర్శించారు. భీమవరంలో బుధవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన జరిగిన సీఐటీయూ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని ఫ్యాక్టరీల్లో తనిఖీలు లేకుండా యాజమాన్యాలకు అనుకూలమైన చర్యలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. సమావేశంలో బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, కర్రానాగేశ్వరరావు, సిరపరపు రంగారావు, జవ్వాది శ్రీనివాస్, మండల సూరి బాబు, ఇంజెటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భావ వ్యక్తీకరణకు భాష ఎంతో అవసరం

భీమవరం (ప్రకాశంచౌక్): అన్ని భాషలతో పరిచయాలు సంబంధాలు ఉన్నా శ్రీకృష్ణదేవరాయలు మన దేశంలో ఎన్ని భాషలున్నా తెలుగు భాషకు సాటి లేదని అన్నారని, తెలుగుకవుల రచనలు గ్రంథాలుగా కళాఖండాలుగా చరిత్రలో యుగాంతం వరకు నిలిచిపోతాయని భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, తెలుగుభాషాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా దినోత్సవంలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో తెలుగు భాషా ఔన్నత్యంపై సదస్సు, తెలుగు రచయితలు, తెలుగు ఉపాధ్యాయులకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. భావ వ్యక్తీకరణకు భాషా అవసరమని, ప్రపంచంలో అనేక భాషలున్నాయని, మన తెలుగు భాష నుంచి సంస్కృతి సంప్రదాయాలు కూడా తెలియజేస్తుందని కమిషనర్ రామచంద్రరెడ్డి అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అమెరికా వంటి అగ్రరాజ్యాల్లో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించడం మన తెలుగు జాతికే గర్వకారణమని అన్నారు. పట్టణంలోని 26 మంది కళాశాల, ప్రాథమిక పాఠశాలలోని రచయితలను, తెలుగు ఉపాధ్యాయులను సత్కరించి ప్రశంసా పత్రాలను అందించామని తెలిపారు. కార్యక్రమంలో వడ్డీ సుబ్బారావు, కలిగొట్ల గోపాల శర్మ, డా గాదిరాజు రంగరాజు, తెలుగు శాఖధిపతి నాము శ్రీవల్లి, అనసూయ, సంఘం సభ్యులు అరసవల్లి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసగించిన వ్యక్తిపై కేసు

నరసాపురం రూరల్: మండలంలోని రుస్తుంబాద గాది వారి తోటకు చెందిన ఓ మహిళను ప్రేమ పేరుతో ఓ వ్యక్తిమాయ మాటలుచెప్పి మోసగించాడని పోలీసులను ఆశ్రయించింది. రూరల్ ఎస్సై టీవీ సురేష్ తెలిపన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా మేడిచర్లపాలేనికి చెందిన కానూరి రవి కుమార్ తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు సదరు యువకుడిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

ఆక్వాసాగుకు అనుమతులు తప్పనిసరి



కేవీకేలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: ఆక్వాసాగు చేస్తున్న రైతులంతా అప్సడా (ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ ఆథారిటీ), ఎంపెడా (మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్సు డెవలప్‌మెంట్ అథారిటీ)లో విధిగా నమోదు చేసుకోవాలని ఎఫ్‌డీఓ ఎం రాంబాబు, అప్సడా ఏడీ ఆనంద్‌కుమార్ అన్నారు. బుధవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం కృషి విజ్ఞాన కేంద్రంలో అప్సడా అనుమతులు, ఎంపెడా ఫార్మ్ ఎన్‌రోల్‌మెంట్‌పై ఆక్వా రైతులు, డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ఆక్వా చెరువులు తవ్వేందుకు, సాగు చేసేందుకు అప్సడాలో అనుమతులు పొందేందుకు ఎకరాకు రూ.వెయ్యి చెల్లించాలన్నారు. ఈ రిజిస్ట్రేషన్‌తో ఆక్వాసాగులో తలెత్తే సమస్యల పరిష్కారం, రసాయనాలు, మందులు, మేతల వల్ల కలిగే నష్టాలపై ఫిర్యాదు చేయవచ్చని, విద్యుత్ సబ్సిడీ, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటులో కూడా సబ్సిడీ లభిస్తుందని వివరించారు. ఎంపెడాలో నమోదుకు ఐదెకరాల్లోపు రైతులు రూ.వెయ్యి చెల్లించాలని తెలిపారు. ఈ నమోదుతో ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు అనుమతి లభిస్తుందన్నారు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని, గుర్తింపు పొందిన హేచరీల్లోనే సీడ్ కొనుగోలు చేయాలని సూచించారు. అధికారుల సూచనల మేరకే మేత లు, మినిరల్స్, మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో కేవీకే మత్స్యశాఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎ.శ్రీనివాస్, ఆక్వా రైతులు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, కందుల బలరామకృష్ణ, గాదిరాజు వెంకటేశ్వరరాజు, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్‌లు కె.రాజేష్, ఎం సూర్యప్రకాష్, టి.భారతి, ఎస్ రాజేష్ పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ



ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతంలో పురాతన ప్రసిద్ధి చెందిన విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద ధ్వజ స్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. సోమవారం నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం పూజా కార్యక్రమాలు అనంతరం ఆలయ అర్చకులు వెలవలపల్లి జానకిరామయ్య ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), గ్రామస్తులు పాల్గొన్నారు.

లైన్‌మెన్ కుటుంబానికి ఆర్థిక సాయం



డిపాజిట్ డాక్యుమెంట్ అందిస్తున్న గ్రామస్తుల

పెనుగొండ: భీమలాపురంలో విధులు నిర్వహిస్తూ విద్యుత్ షాక్‌కు గురైన మరణించిన లైన్‌మెన్ రాజు కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచారు. చిన్న వయస్సులోనే మృతి చెందడంతో భార్య పిల్లలను ఆదుకోవాలనే తలంపుతో గ్రామస్తులు రూ.1.35 లక్షలు సేకరించి యూనియన్ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ పత్రాన్ని బుధవారం ఆ కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుబ్బల మాధవరావు, మాజీ సర్పంచ్ చింతపర్తి సత్యనారాయణ, ద్వాదశి సీతారామయ్య, మొల్లేటి త్రిమూర్తులు, మడికల రాము, తోట త్రిమూర్తులు పాల్గొన్నారు.